# నిర్ణయం

రిక్షా దిగి లోపలికి వస్తున్న వాసవిని చూడగానే "అమ్మా! అక్కయ్య వచ్చిందే" అంటూ లోపలికి పరిగెత్తుకు వెళ్ళి తల్లితో చెప్పి మళ్ళీ బయటకు పరుగుతీసింది పదేళ్ళ వారుణి.

అన్నం వారుస్తున్న క్రిష్ణవేణమ్మ చేతులు వణికాయి. గుండెలు దడదడలాడుతుండగా, అన్నం గిన్నె క్రింద పెట్టేసి, కొంగుతో చెమటలు ఒత్తుకుంటూ నిస్త్రాణగా కూర్చుండిపోయింది.

వరండాలో పడక కుర్చీలో వాలి పేపరు తిరగేస్తున్న కోదండం మెట్లెక్కి వస్తున్న కూతుర్ని చూడగానే దీర్ఘంగా నిట్టూర్చి పేపరు మడిచి పెట్టి కుర్చీలోంచి లేచి వాసవి చేతిలోని సూట్‌కేస్‌ను అందుకుని ఒక్కర్తే వచ్చావేమ్మా? అన్నాడు.

తనని చూడగానే తండ్రి ముఖంలో కనపడిన దిగులు చూస్తుంటే వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలని పించింది వాసవికి.

కానీ అడుగులు ముందుకే పడ్డాయి. తప్పు చేసిన దానిలా తలవంచుకుని, తండ్రి వైపు చూడకుండా లోపలికి నడిచింది.

లోతుకుపోయిన కళ్ళు, వడలిపోయిన ముఖంతో, ప్రపంచంలోని నిరాశ అంతా తనలోనే గూడు కట్టుకున్నట్టున్న కూతుర్ని చూచిన కోదండం గుండె బరువెక్కింది.

'భగవంతుడా! రక్షించు' అనుకుంటూ తిరిగి కుర్చీలో వాలాడు.

అయిదు నిమిషాల్లో తేరుకున్న క్రిష్ణవేణమ్మ ముందు గదిలోకి వచ్చి కూతుర్ని పలుకరించింది.

"నెల్లాళ్లయి ఉత్తరమే రాయలేదేమ్మా? అంతా కులాసాయేనా? నీ ఆరోగ్యం ఎలా వుంది? బాబు ఏడి? అంటూ.

తల్లినిచూడగానే అంతదాకా దాచుకున్న కన్నీళ్ళు గండి పడిన చెరువులా దూకి వచ్చాయి వాసవి కళ్ళలో.

నిలబడలేనట్టుగా క్రింద కూలబడి మోకాళ్ళమీద తల వాల్చుకుంది.

కూతురి పక్కనే కూర్చుని, ఆ పిల్ల తల మీద చేయివేసి లాలనగా, ఓదార్పుగా నిమిరింది క్రిష్ణవేణమ్మ.

"పెళ్ళికాని ఆడపిల్ల గుండెలమీద కుంపటిలాటిదని అంటారు. కాని పెళ్ళయిన ఈ ఆడపిల్లను, మా గుండెల లోపల కుంపటిలా చేసే వెందుకు దేవుడా? అనుకుంటుంటే ఆమె కళ్ళు చెమర్చేయి.

'అక్కయ్యా! ఈసారి కూడా చాలా రోజులు వుంటావు కదా?' పెద్ద వాళ్ళ మనసుల్ని దహించి వేస్తున్న సమస్యలను గ్రహించే వయసులేని వారుణి అక్కయ్య భుజాల మీద వాలి గారంగా అడిగింది.

"నువ్వు నోరు మూసుకుని అవతలకు పో" అంటూ కసిరింది క్రిష్ణవేణమ్మ.

"నన్ను చూడగానే నీకు ఎన్నాళ్ళుంటానో అని భయమేసింది కదమ్మా. నీ విసుగు పసిదాని మీద చూపిస్తావెందుకే పాపం?" పేలవంగా నవ్వి తల్లితో అని, "వరాలూ నేను కాసేపు అమ్మతో మాట్లాడాలి వెళ్ళి ఆడుకో తల్లీ." అంది చెల్లెలి చేతులు తన భుజాల మీదనుండి తీసేస్తూ.

"నువ్వెప్పుడూ ఇలాగే అంటావు. నాతో మాట్లాడనే మాట్లాడవు" కోపంగా అనేసి, కాళ్ళు నేలకేసి బాదుతూ వెళ్ళిపోయింది వారుణి.

"చూసావామ్మా! దానికీ తేలికయిపోయాను." బాధగా అంది వాసవి.

"పసిపిల్ల దాన్ని పట్టించుకోకు, ముఖం, కాళ్ళు కడుక్కురా, వేడిగా కాఫీ త్రాగితే నీకు కాస్త తెరిపిగా వుంటుంది" అనునయంగా చెప్పి, వంటింటి వైపు నడిచింది తల్లి.

అప్పుడే బయటనుండి వచ్చిన చంద్రమౌళి నట్టింట్లో మోకాళ్ళ మీద తలవాల్చి కూర్చున్న అక్కయ్యను చూసి ముఖం చిట్లించి లోపలికి వెళ్ళిపోయాడు.

అడుగుల శబ్దం విని తలెత్తిన వాసవి తనను పలుకరించకుండానే వెళ్తున్న తమ్ముడిని చూసి మనసు కష్ట పెట్టుకుంది.

"ఇదిగో నేను బయటకు వెళ్తున్నా పిల్లలకు అన్నాలు పెట్టేయి" అరుగు మీదనుండే లోపలికి ఒక్క కేక పెట్టి వెళ్ళిపోయాడు కోదండం.

తనను మాట్లాడించకుండా ముఖం తప్పించి వెళ్ళిపోతున్న తండ్రి మీద వాసవికి కోపం రాలేదు.

ఆయనను ఈ పరిస్థితికి తీసుకువచ్చిన తనమీద తనకి ఏవగింపు కలిగింది.

"మళ్ళీ ఏం ముంచుకొచ్చిందమ్మా? ఈ ఇంట్లో మనుషులు శాంతిగా బ్రతికే యోగం లేదా?" విసుగ్గా అంటున్నాడు చంద్రమౌళి తల్లితో.

"ఏం చేస్తాం? మన ఖర్మ! అది వింటే బాధపడుతుంది ఊరుకో" నెమ్మదిగా అంది క్రిష్ణవేణమ్మ.

'అత్తవారింటి నుండి అమ్మాయి వచ్చిందంటే కొండంత సంబరపడతారు తల్లిదండ్రులు. ఆ సంతోషం వీళ్ళకు లేకుండా చేసింది తన దురదృష్టం.' భారంగా నిట్టూర్చింది వాసవి.

నెమ్మదిగా లేచి వంటింటి గుమ్మం దగ్గరకు వెళ్ళి నిలబడి "ఈసారి నేను వెళ్ళడానికి రాలేదమ్మా – ఉండిపోవడానికే వచ్చాను" అంది లోగొంతుకతో.

అదిరిపడి అక్క ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు చంద్రమౌళి.

కలకల్లాడుతూ మల్లెచెండులా వుండే అక్కయ్య నీళ్ళు లేని లతలా ఎండిపోయి కనబడుతుంటే అతని మనసు కలుక్కుమంది. ఏమీ చేయలేని అసహాయతతో తలదించు కున్నాడు.

"అవేం అశుభం మాటలే! పుట్టింటికి వచ్చిన ఆడపిల్ల లక్షణంగా ఒడి బియ్యం పెట్టించుకుని మరీ వెళ్ళాలిగానీ..." కూతుర్ని మందలించబోయిన క్రిష్ణవేణమ్మ మాటలు పేలవంగా వచ్చాయి.

"ప్రతిసారీ అప్పో సొప్పో చేసి లక్షణంగా పంపిస్తూనే వచ్చావుగానీ అమ్మా ఈసారి నీవల్ల కాదే..." వాసవి గొంతు వణికింది.

పెళ్లైన ఆరు నెలల లోపుగానే తొలి దీపావళికి కూతుర్నీ అల్లుడిని పిలిచి బట్టలు చదివిస్తే "అమ్మా ఆయనకు అరిస్టోక్రాట్ సూట్‌కేసు కావాలిట' అంటూ గొణిగింది వాసవి.

అనుకోని ఖర్చే అయినా ఎలాగో ఆరువందలు సర్ది అల్లుడి కోరిక తీర్చారు.

ఏడాదిలోపే వాసవిని కాన్పుకు తీసుకురావాల్సి వచ్చింది.

పెళ్ళి అప్పు తీరకుండానే సీమంతానికి బాలసారెకూ అప్పు చేయాల్సి వచ్చింది.

నామకరణానికి వస్తూ మనవడికి వందరూపాయలు చొక్కా తెచ్చింది అత్తగారు.

అల్లుడుగారు బయల్దేరుతూ "వచ్చేటప్పుడు మీ నాన్ననడిగి టూ ఇన్ వన్ స్టీరియో టేప్ రికార్డర్ తీసుకురా, రెండు నెలలు ఆలస్యమైనా పరవాలేదుగానీ ఉత్త చేతులతో మాత్రం రాకు" అని చెప్పి వెళ్ళాడు.

మళ్ళీ అప్పుచేసి అల్లుడి ఆనతి ప్రకారం 'స్టీరియో' మూడు వేలు పెట్టి కొనిచ్చి అమ్మాయినీ, మనవడినీ వదిలి పెట్టి వచ్చాడు.

మూడు నెలలు గడవక ముందే "అమ్మాయికి అబార్షన్ అయింది. వచ్చి తీసుకు వెళ్ళమని" ఉత్తరం వచ్చింది.

తల్లడిల్లిపోతూ వెళ్ళిన క్రిష్ణవేణమ్మ కూతురి పరిస్థితి చూసి దిగులు పడిపోయింది.

"చదువుకున్న పిల్లవు... కాస్త జాగర్త పడలేవుటే?" అంటూ మందలించింది.

"నేనేం చేయనమ్మా? అతనేమీ పట్టించుకోరు. మాత్రలు తెచ్చి పెట్టమంటే 'నీ పుట్టింటి ఆస్తి ఏమీ రాసులు పోయలేదిక్కడ' అని వెక్కిరించారు." బావురు మంది వాసవి.

కూతుర్ని తీసుకువచ్చి, రెండు నెలలు తన దగ్గరే పెట్టుకుని, మందులూ టానిక్కులూ ఇచ్చి మనిషిగా చేసి పంపించారు.

నాలుగు నెలలు గడిచాయో లేదో మళ్ళీ వాసవి పుట్టింటికి రావడంతో ఏం ఉపద్రవం తెచ్చిందోనని భయపడుతున్నారు ఇంట్లో వాళ్ళంతా.

తండ్రి వచ్చేదాకా అన్నం తినకుండా కూర్చుంది వాసవి.

'ఏమ్మా? అల్లుడుగారేమంటున్నారు? బాబును వదిలేసి వచ్చావు. దిగులు పడదూ?' భోజనాల దగ్గర అడిగాడు కోదండం.

వాసవి తలవంచుకుంది. 'ఆయన స్కూటర్ కొంటార్ట నాన్నా సెకండ్ హాండ్‌ది తొమ్మిది వేలుట. మీరొక అయిదు వేలయినా సర్దాలిట." చెప్పలేక చెప్పింది.

"పోనీ జోలె పట్టుకుని బిచ్చమెత్తుదామన్నా ఎవరిస్తారమ్మా నాకంత డబ్బు!" కోదండం గొంతు ఆవేదనతో వణికింది.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలప్పుడు బయటకు బయల్దేరుతున్న తండ్రి దగ్గరకు వచ్చి వాసవి. 'నేనిక అక్కడికి వెళ్ళను నాన్నా. ఇక్కడే వుండిపోతాను" అంది తలదించుకుని నెమ్మదిగా.

"ఇక నీ చెల్లెలికి పెళ్ళి పేరంటం వద్దా తల్లీ? కన్నవాళ్ళకు తప్పదు. ఏదో తంటాలు పడతాం కానీ మా పరువు మంట కలపకు." అనేసి వెళ్ళిపోయాడు కోదండం.

ఇంట్లో వున్న వెండి కంచం, చెంబూ అమ్మేసి మిగిలిన డబ్బుకోసం వాళ్ళకాళ్ళూ వీళ్ళ చేతులూ పట్టుకుని బ్రతిమలాడి ఎలాగో అయిదువేలు సిద్ధం చేసాడు వారం రోజుల్లో.

ఈ వారం రోజులూ యోగ సమాధిలో వున్నట్టు మౌనంగా వుండిపోయింది వాసవి.

ఈ దిగులు వల్లనో ఏమో క్రిష్ణవేణమ్మ జ్వరం వచ్చి పడుకుంది.

"నాకు చూస్తే సెలవు లేదు. మీ అమ్మకు జ్వరం... మౌళిని పంపిస్తానుగానీ బయల్దేరమ్మా వచ్చి పది రోజులవుతోంది. అల్లుడు ఏంకోపం చేసుకుంటాడో ఏమో.." అన్నాడు ఒక మంచి రోజున.

"వాళ్ళెవరైనా వచ్చి నన్ను దిగబెట్టారా నాన్నా మీరు ఈ మర్యాదలు నడపడానికి? మౌళికి వాళ్ళపోడంటే గిట్టదు. పైగా వాడికి పరీక్షలు కూడా దగ్గరకొస్తున్నాయి. దగ్గరేగా... నేనే వెళ్తాను.." అంది వాసవి.

అయిష్టంగానే అమ్మాయిని ఒంటరిగా పంపడానికి ఒప్పుకున్నాడు కోదండం.

"కొత్తచోటు కాదుగా నాన్నా భయపడకండి. క్షేమంగా చేరినట్టు ఉత్తరం రాస్తానుగా" ధైర్యం చెప్పి బండెక్కింది.

"ఇటుపైన ఇక ఈ సర్దడాలు నావల్ల కాదని అల్లుడికి చెప్పు తల్లీ" కాస్త నిష్ఠూరంగానే చెప్పాడు.

అలాగేనన్నట్టు తల ఊపిన వాసవి "మరోసారి నా గురించి ఇలా దిగులు పడే అవసరం రానివ్వను నాన్నా వస్తానమ్మా" అంటూ సెలవు తీసుకుంది.

X X X

వాసవి వెళ్ళి పదిహేను రోజులు దాటుతూంది. "అమ్మాయి నుండి ఉత్తరం రాలేదేమిటండి! అంటూ కంగారు పడుతూంది క్రిష్ణవేణమ్మ.

పైకి బింకంగా వున్నా మనసులో దిగులు పడుతూనే వున్నాడు కోదండం.

చంద్రమౌళిని పంపి చూచి రమ్మందామా అని ఆలోచిస్తున్నాడు.

అయితే ఆ ఆలోచన కార్యరూపం దాల్చకముందే పోస్ట్‌మాన్ రెండు కవర్లు తెచ్చి ఇచ్చాడు.

పైనే ఉన్న అల్లుడి ఉత్తరాన్ని ఆతృతతో విప్పి చదివాడు కోదండం. ఆ తొందరలో రెండో కవరుమీది దస్తూరీ గమనించలేదు.

'వెళ్ళి నెల్లాళ్ళు దాటుతున్నా వాసవి రాలేదు గనుక ఆమెకు సంసారం అవసరం లేదని అర్థమయిందనీ, భర్త, కొడుకు కూడా అవసరంలేని ఆమె తనకు అక్కర్లేదనీ, విడాకులు ఇవ్వ నిశ్చయించుకున్నాను. కనుక అల్లరి పడకూడదన్న ఇంగితం గలవారైతే విడాకుల పత్రంపై సంతకం చేసి పంపవలసిందని రాసేడు అల్లుడు.

ఆ ఉత్తరం చదివిన కోదండం బుర్ర మొద్దుబారిపోయింది.

"వాసవి ఏమయిపోయిందన్న భయం మనసును కుదిపివేస్తూంది.

"ఎవరి దగ్గరి నుంచీ నాన్నా ఉత్తరం?" అంటూ వచ్చిన చంద్రమౌళి తండ్రి వాలకం చూసి కంగారు పడ్డాడు.

"ఈ ఉత్తరం ఎక్కడినుంచీ?" అనడుగుతూ కవరు చూసి "అక్కయ్య నుంచి వస్తే విప్పలేదేం?" అని కవరు చింపి కాగితాలు బయటకు తీసాడు.

షాక్ నుండి తేరుకున్న కోదండం "అక్కయ్య రాసిందా?" అంటూ ఆ కాగితాలు లాక్కున్నాడు.

నాన్నా

ఈ సరికి మీ అల్లుడిగారి నుండి మీకు ఘాటైన ఉత్తరం అంది వుంటుంది. అది చూచి

మీరు భయపడవలసిన పనిగానీ, బాధ పడవలసిన అవసరంగానీ లేదు. ఎందుకంటే ఇకపై నేను ఆయన భార్యగా కాక, మీ కుమార్తెగా మాత్రమే జీవించాలని నిర్ణయించుకున్నాను. ఇంకోసారి డబ్బు సర్దడం జరగదని ఆయనకు చెప్పమన్నావు. అది అంత సులభమనుకున్నావా నాన్నా! మీమాటే జరగాలంటే ఇంకోసారి మీరు మీ కూతురి శవం చూడటానికే రావాల్సి వచ్చేది.

ఈ రెండేళ్ళ కాలంలో ఆ ఇంట్లో నరకం అనుభవించాను నాన్నా! మిమ్మల్ని బాధ పెట్టలేక నోరువిప్పి నా కష్టం చెప్పుకోలేదు. మొన్న మీ దగ్గరికి వెళ్ళనన్నానని మూడు రోజులు నాకు అన్నం పెట్టకుండా గదిలో పెట్టి తాళం వేసారు. పశువును బాదినట్టు బాది నా కొడుకును కూడా నాకు కనబడనీయకుండా చేసారు ఇలా చేస్తే నేను చచ్చిపోతానని ఏడ్చాను. 'ఆ గదిలోనే కిర్సనాయిల్ డబ్బా, అగ్గి పెట్టె వున్నాయి, పోసుకుని అంటించుకో, పీడా వదులుతుంది. అంది మా అత్తగారు. ఆయన విని ఊరుకున్నారు.

ఆయనకు నేను కోరికలు తీర్చే యంత్రాన్నేగానీ మనసున్న మనిషిని కాను నాన్నా! మా అత్తగారికి నేనొక పని మనిషిని. మా ఆడబడుచు చదువుకున్న మూర్ఖురాలు. ఆ ఇల్లు, ఆస్తి తల్లివి గనుక తదనంతరం తనవేనన్న అహంకారంతో గతిలేక వాళ్ళింట్లో పడివున్న దాసిలా చూస్తుంది నన్ను. నా వస్తువులేవీ ఆమెకు నచ్చని చోట పెట్టకూడదు. ఇంట్లో వుండే చెత్త సామానంతా మా పడక గదిలో పెట్టి శుభ్రత తెలీదని నన్ను సూటిపోటు మాటలంటుంది. అన్నగారు వ్యక్తిత్వం లేని వాడు గనుక నా మీద చాడీలు చెప్పి తిట్టించడం ఆవిడకు సరదా. కొడుకుతో నన్ను కొట్టించడం మా అత్తగారి వంతు. నా కొడుకును దగ్గరికి తీసే హక్కు కూడా నాకు లేకుండా చేసారు. బిడ్డను నాతో పంపమని బ్రతిమలాడినా ఏడ్చినా ఒప్పుకోలేదు. వాడిని అక్కడే పెట్టుకుంటే డబ్బు తీసుకుని త్వరగా వస్తానని వాళ్ళ ఉపాయం. ఈసారి ఎలాగో డబ్బు సర్దావు. వాళ్ళు అంతటితో తృప్తి పడరు. అప్పుడైనా నాకు వాళ్ళ చేతిలో నరకం తప్పదు.

వాళ్ళ పంచన చేరి మృత్యువునాహ్వానించడం కన్న స్వతంత్రంగా నా బ్రతుకు నేను బ్రతకడం మేలు కాదా నాన్నా! అందుకే ఈ నిర్ణయానికి వచ్చాను. నాకు తెలుసు. వాళ్ళు నానా మాటలూ అంటారు. కానీ మీ కుమార్తె తప్పు దారి పట్టదనే నమ్మకం మీకుంటే నాకు చాలు. ఎవరేమనుకున్నా లెక్క చేయను. పరువు తక్కువ పని చేసానని, చెల్లెలికి పెళ్ళి కాదని దిగులు పడవద్దు. సంఘం మారుతోంది. సతీ సహగమనాలు పోయినట్టే కట్న పిశాచికి ఆహుతి అయ్యే అమాయకుల సంఖ్యా తగ్గుతుంది. స్త్రీ ధైర్యంగా తనకోసం తను జీవించగల రోజులు వస్తాయి. వివాహమనే వధ్యశిల మీద బలి పశువును కాలేని నన్ను మన్నించండి. ఇరవై సంవత్సరాలు అల్లారు ముద్దుగా పెంచి చదివించి పెళ్ళి చేసి పంపిన మీ కూతురి అకాల మరణం చూడటం కన్న మీరు నా తెగింపునే హర్షిస్తారని నా నమ్మకం. ఇక నా బిడ్డ సంగతంటారా? కన్న పాశం తెంచుకోలేనిదే అయినా, ఆ పాశంతో నాకే ఉరి బిగిస్తుంటే త్రెంచు కోవాలనే నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం నా స్నేహితురాలి దగ్గర వున్నాను. ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను. ఉద్యోగం దొరక్కపోయినా

బట్టలు కుట్టో ఎంబ్రాయిడరీ చేసో బ్రతకగలను. మీరిచ్చిన డబ్బు నన్ను మనిషిగా నిలబెట్టడానికి సహాయపడుతోంది, మీ ఆశీస్సులే రక్షగా జీవించాలనుకుంటున్న మీ వాసవిని మన్నించి దీవించరూ? అమ్మకు నా నమస్కారములు తెలుపండి. నా గురించి దిగులు పడవద్దని నచ్చజెప్పండి. మౌళికి, వారుణికి నా ఆశీస్సులు. మీనుండి ఒక చిన్న మాటైనా జవాబుగా వస్తే నాపట్ల మీ ప్రేమాభిమానాలు చెరిగిపోలేదన్న ధైర్యంతో ముందుకు సాగుతాను.

నమస్సులతో,

మీ,

వాసవి.

కొద్దిసేపు కర్తవ్యతా విమూఢుని వలె కూర్చుండి పోయిన కోదండం నెమ్మదిగా తేరుకున్నాడు. అల్లుడు పంపిన విడాకుల పత్రాలు, ఉత్తరం మరో కవర్లో పెట్టి, మరో చిన్న కాగితంమీద "మా ఆశీస్సులు నీకెప్పుడూ వుంటాయి. జరగవలసిన విషయం చూడు తల్లీ!" అని రాసి దాన్నికూడా కవర్లోపెట్టి వాసవి అడ్రస్ రాసి పోస్టాఫీసుకు వెళ్ళి పోస్ట్ చేసి నిశ్చింతగా ఇంటిదారి పట్టాడు కోదండం.

**"వనిత" మాస పత్రిక**

తేది : డిసెంబరు, 1990.